క్లుప్తంగా

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన



టూటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద బాధితురాలి బంధువుల ఆందోళన

విజయనగరం క్రైమ్: తమకు న్యాయం చేయాలని బాధితురాలి బంధువులు స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం రాత్రి ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి..విజయనగరం ఆర్డీవో కార్యాలయం వద్ద ఓ రెస్టారెంట్ నడుపుతున్న వ్యక్తి అప్పులపాలై తన రెస్టారెంట్‌ను మూసివేశాడు. అతడికి లంకాపట్నంకు చెందిన ఓ మహిళతో వివాహమైంది. అతడు తన భార్యను కూడా సరిగా చూసుకోకపోవడంతో బంధువులతో కలిసి బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. రెస్టారెంట్ ఉందని, బాగా బతుకుతారని నమ్మి రూ.8 లక్షల కట్నం ఇచ్చి మరీ తమ పిల్లను ఇచ్చి పెళ్లి చేశామని బాధిత బంధువులు తెలిపారు. ఇప్పుడు అతడు రెస్టారెంట్ మూసేసి, ముఖం చాటేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తమకు ఎలాగైనా న్యాయం చేయాలని కోరారు. అప్పటికే పోలీసులు వేరే ఫిర్యాదుదారులతో బిజీగా ఉండడంతో తమను పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితురాలి బంధువులు స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న సీఐ టి.శ్రీనివాస్.. ఎస్ఐ కనకరాజును వారి సమస్యను పరిష్కరించాలని ఆదేశించగా, భార్యాభర్తలను పిలిపించి రెండు రోజుల్లో వారి సమస్య పరిష్కారానికి అంగీకారానికి వచ్చేలా సర్దిచెప్పారు.

కనకమహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



ఆలయానికి వెళ్తున్న భక్తులు

చీపురుపల్లి: కూరగాయల పంటలను ఆశిస్తూ తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్న నత్తల సంహరణ జరగాలని ఆకాంక్షిస్తూ చీపురుపల్లి ప్రజల ఇలవేల్పు కనకమహాలక్ష్మి అమ్మవారిని కూరగాయల రైతులు వేడుకున్నారు. ఈ మేరకు పట్టణంలోని కూరాకులవీధి, విజయాకాలనీలో ఉన్న కూరాకుల రైతులు అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూరాకుల సామాజికవర్గానికి చెందిన వారంతా పట్టణ శివారున కూరగాయలు పండిస్తున్నారు. అయితే ఇటీవల కాలంలో నత్తలు విపరీతంగా వచ్చి కూరగాయల పంటను పాడు చేస్తున్నాయి. ఆ నత్తల నుంచి పంటలను కాపాడాలని కోరుతూ అమ్మవారికి పూజలు చేశారు.

ప్రమాదకరంగా ఎల్.కోట - ఖాసాపేట రోడ్డు



రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చిమొక్కలు

లక్కవరపుకోట: మండలంలోని ఎల్.కోట నుంచి ఖాసాపేట, తలారి, కొట్యాడ మీదుగా అలమండ సంత జంక్షన్‌కు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. రెండువైపులా తుప్పలు, పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించడం లేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

అభివృద్ధికి నోచుకోని రోడ్లు..



శృంగవరపుకోట: కొట్టాం రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

శృంగవరపుకోట: రోడ్డుమీద తిరిగే ప్రతి వాహనదారుడి నుంచి రోడ్ ట్యాక్స్ వసూలు చేస్తారు. టోల్‌ప్లాజాలు పెట్టి పైసలు గుంజేస్తారు. కాని వాహన రాకపోకలకు వీలుగా రహదారులను మాత్రం అభివృద్ధి చేయరు. ప్రమాదాల్లో ప్రాణాలు పోయినా కనీసం పట్టించుకోరు. మండలంలోని చాలా రోడ్లకు గ్రావెల్ బెర్మ్‌లు వేయలేదు. జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడంతో చాలా రోడ్ల మీదకు తుప్పలు రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. మెయింటినెన్స్ పనులు చేయమంటే అధికారులు నిధుల్లేవంటారు. ముఖ్యంగా ధర్మవరం, కొట్టాం రహదారులు ప్రమాదకరంగా మారాయి.

పెళ్లిభాజాలకు వేళాయె!

- పెళ్లి చేసుకునే వారికి శుభవార్త
- ఈ నెల 2 నుంచి 27 వరకు అన్నీ శుభముహూర్తాలే..
- ఒక్కటి కానున్న వేలాది జంటలు



విజయనగరం: పెళ్లిభాజాలు మోగే సమయం ఆసన్నమైంది. అక్టోబరు 2 నుంచి నవంబరు 27వ తేదీ వరకు అన్నీ శుభముహూర్తాలే ఉన్నాయి. ఎంతోమంది పెళ్లీడుకు వచ్చిన యువతీ యువకులు మూడుముళ్ల బంధంలోకి అడుగుపెట్టి పెద్దల ఆశీర్వచనాలు పొందాలని చూస్తున్నారు. కొంతకాలంగా మంచి ముహూర్తాలు లేక ఈ అక్టోబరు నెల కోసం అంతా ఎదురుచూస్తున్నారు. సమయం రానే వచ్చిందన్న ఆనందంలో పెళ్లి ఏర్పాట్లు చకచకా చేసుకుంటున్నారు. ఇప్పటికే కల్యాణ మండపాలు బుక్ చేసుకుంటున్నారు. అందులోనూ వర్షాకాలం కావడంతో 80 శాతం మంది కళ్యాణ మండపాల్లోనే పెళ్లిళ్లు చేసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. మిగిలిన వారంతా సొంతిళ్లు, ఆలయాల వద్ద పెండ్లి చేసుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. 56 రోజుల పాటు కొనసాగే శుభముహూర్తాలతో జరిగే పెళ్లిళ్లతో దాదాపు 30కు పైగా రంగాలకు చెందిన నిపుణులకు చేతినిండా పని దొరకనుంది. ఇదిలా ఉంటే నవంబరు 28 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు శుక్ర మూఢం కారణంగా శుభకార్యాలకు విరామం.

కళ్యాణ మండపాలకు డిమాండ్.

విజయనగరం జిల్లా వ్యాప్తంగా దాదాపు 4 వేల నుంచి 5 వేల వరకు కళ్యాణ మండపాలు ఉండగా వాటితో పాటు పలు ఆలయాల్లోనూ వివాహాలు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రం సహా పలు పట్టణాల్లో నాన్ ఏసీ కళ్యాణ మండపాల్లో కూడా పెళ్లిళ్లు నిర్వహించుకునేందుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష చెల్లించాల్సి వస్తోంది. సకల సౌకర్యాలు ఉండే ఏసీ కళ్యాణ మండపాలకు అంతకు మూడింతలు అధికంగా చెల్లించాల్సి వస్తోంది. సౌకర్యాలు, సీజన్ బట్టి కొన్నిచోట్ల రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు కూడా కళ్యాణ మండపాల నిర్వాహకులు అద్దె తీసుకుంటున్నారు. ఆయా తేదీల ప్రకారం ముందుగానే వారి ఆర్థికస్తోమత కొద్దీ మండపాలను బుక్ చేసుకుంటున్నారు. ఇక భోజనాల కోసం క్యాటరింగ్ వారిని నియమించుకుంటున్నారు. సాధారణ భోజనం ప్లేటు రూ.200 ఉంటే వివిధ రుచుల, రకాల ఖరీదైన భోజనం ప్లేటు రూ.700కు పైమాటే పలుకుతోంది. అలాగే పెళ్లి ఊరేగింపులో సందడి చేసే డీజే సౌండ్‌లు, బ్యాండ్ మేళాలు, కార్లు, పురోహితుల కోసం భారీగానే ఖర్చు చేస్తున్నారు. ముందుగానే అడ్వాన్సులు చెల్లించుకుని బుక్ చేసుకుంటున్నారు. మరీ ముఖ్యంగా పెళ్లికి అవసరమైన షాపింగ్‌కు సంబంధించి, ఎవరికి వారు వారి స్థాయిని బట్టి చేస్తున్నారు. ప్రధానంగా వస్త్రాలు, బంగారు, వెండి ఆభరణాల కొనుగోళ్లు, సారె కొనడం జరుగుతోంది.

మంచి ముహూర్తాల తేదీలివే..

అక్టోబర్ : 2, 3, 8, 11, 12, 24, 26, 29, 30, 31
నవంబర్ : 7, 8, 15, 22, 26, 27

శుభ ఘడియల్లో పెళ్లి మంచిది..

ఈ నెల 2 నుంచి పెళ్లి ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే చాలామంది పెళ్లిళ్లకు ముహూర్తాలు ఖరారు చేసుకున్నారు. మంచి ఘడియల్లో పెళ్లి చేసుకుంటే జీవితం సాఫీగా సాగిపోతుందని, మరో పెళ్లి ప్రస్తావన, ప్రసక్తి ఉండదన్నది హిందూ సంప్రదాయం పాటించే వారి నమ్మకం. నవంబరు 28 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు మూఢ్యం వచ్చేస్తుంది.

–పి.కామేశ్వరశర్మ, వేదపండితులు

నిరసన



శ్మశానవాటిక స్థలం కబ్జాకు వ్యతిరేకంగా విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని కొత్తధర్మపురి గ్రామస్తులు నిరసనకు దిగారు. అదే గ్రామంలో నడిరోడ్డుపై శ్మశానవాటిక కబ్జాదారుల దిష్టిబొమ్మలను దహనం చేస్తూ ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. కబ్జాదారుల నుంచి కొత్తధర్మపురి శ్మశానవాటికను కాపాడాలని నినాదాలు చేశారు. తమ పూర్వీకుల నుంచి ఆ స్థలాన్ని చనిపోయిన వారి అంత్యక్రియల కోసం వినియోగిస్తే దానికి కొంతమంది ఆక్రమిస్తున్నారని, వారికి కొంతమంది అధికారుల అండదండలు కూడా ఉన్నాయని ఆరోపించారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

–విజయనగరం రూరల్

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి



ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తామన్న నిర్ణయం ప్రభుత్వం మానుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల వలరాజు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన జిల్లా కేంద్రంలోని అమర్ భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. పేద విద్యార్థులకు వైద్యవిద్యను దగ్గర చేయాలన్న సదుద్దేశ్యంతో వైఎస్సార్ సీపీ హయాంలో మంజూరై నిర్మాణాలు ప్రారంభమైన కళాశాలలను పీపీపీ(పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్) విధానంలో నడుపుతామని ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వమే కళాశాలలు నిర్వహిస్తే విద్యార్థులకు ప్రయోజనమని, ప్రైవేటుకు అప్పగిస్తే వైద్యవిద్యకు పేద విద్యార్థులను దూరం చేయడమే అవుతుందన్నారు. అనంతరం అక్టోబరు 22 నుంచి నవంబరు 12వ తేదీ వరకు విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపడుతున్న బస్సు జాతా కార్యక్రమ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.నాగభూషణం, సహాయ కార్యదర్శి పి.గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

–విజయనగరం గంటస్తంభం

అనుమతి లేకుండా బాణాసంచా విక్రయిస్తే చర్యలు



ఎస్ఐ గణేష్

నెల్లిమర్ల: అనుమతి లేకుండా ఎవరైనా బాణాసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ గణేష్ ఓ ప్రకటనలో ఆదివారం హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడైనా ఎవరైనా మందుగుండు సామగ్రి తయారు చేసినా, అమ్మినా సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలంతా బాణాసంచా కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీలైనంత వరకు కాలుష్యం లేని హరిత దీపావళి జరుపుకోవాలని కోరారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



జెడ్పీ చైర్మన్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మణరావు

నెల్లిమర్ల రూరల్: కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సూచించారు. వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మండలంలోని మొయిద గ్రామానికి చెందిన దవళ లక్ష్మణరావు నియమితులు కాగా ఆయన జెడ్పీ చైర్మన్‌ను జిల్లా కేంద్రంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పార్టీ పదవి కట్టబెట్టినందుకు గాను పార్టీ అధిష్ఠానానికి, జెడ్పీ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ సమన్వయం చేసుకుని పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీని నమ్ముకున్న వారికి సముచిత గౌరవం ఇవ్వడం జరుగుతుందని, పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా అందరూ పనిచేయాలని జెడ్పీ చైర్మన్ కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కల్తీమద్యంపై నిరసన ర్యాలీకి తరలిరండి



వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గదల సన్యాసినాయుడు

నెల్లిమర్ల రూరల్: కల్తీమద్యానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సోమవారం చేపట్టే నిరసన ర్యాలీకి పార్టీ శ్రేణులంతా తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు ఓ ప్రకటనలో ఆదివారం కోరారు. ర్యాలీ అనంతరం ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టడం జరుగుతుందన్నారు. కల్తీమద్యం వల్ల ఎంతోమంది ప్రాణాలు పోతున్నాయని, దీనిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలన్న సదుద్దేశ్యంతో చేస్తున్న ఈ కార్యక్రమానికి అందరూ మద్దతు పలకాలన్నారు.

మహిళలకు రక్షణ ఏదీ?



మహిళలకు రక్షణ లేదని, ఎక్కడ చూసినా వరకట్న వేధింపులు, భౌతికదాడులు, లైంగికదాడులు, రాజకీయ ప్రలోభాల మధ్య మహిళా లోకం నలిగిపోతోందని ఐద్వా(అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) జిల్లా అధ్యక్షురాలు పి.రమణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర మహాసభల నిమిత్తం అనంతపురానికి వెళ్లేందుకు విజయనగరం రైల్వేస్టేషన్‌కు మహిళలతో కలిసి ఆదివారం చేరుకున్న ఆమె.. మహిళా హక్కులు, రక్షణ, స్వేచ్ఛలపై పుస్తకాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మాటల్లో ఉన్నది వాస్తవ పరిస్థితుల్లో ఆచరణలో లేదన్న విషయం అందరూ గుర్తెరగాలన్నారు. ప్రతిఒక్కరూ మహిళా శక్తి బలోపేతం, సాధికారిత దిశగా అడుగులు వేయాలని, అన్ని రంగాల్లో మహిళలు రాణించేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షురాలు రెడ్డి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

–విజయనగరం గంటస్తంభం

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న.. బెల్ట్ షాపులు



ఎం.వెంకటాపురంలో వెలిసిన బెల్ట్‌షాపు

- రెచ్చిపోతున్న మద్యం బాబులు
- నాసిరకం మద్యంతో వ్యాపారుల దోపిడీ
- పట్టించుకోని అధికారులు

గజపతినగరం: నియోజకవర్గ వ్యాప్తంగా బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా వెలిశాయి. లైసెన్స్‌డ్ దుకాణం ఒకటి ఉంటే పదుల సంఖ్యలో బెల్ట్‌షాపులు పుట్టుకొస్తున్నాయి. దీంతో మద్యం వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు హాఫ్‌ల మాదిరిగా సాగుతోంది. పైగా నాణ్యమైన మందు కంటే నాశిరకం మందు విక్రయిస్తూ అటు వ్యాపారులు, ఇటు బెల్ట్ షాపు నిర్వాహకులు మందుబాబులను దోచుకుంటున్నారు. గజపతినగరం నియోజకవర్గంలో గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, మెంటాడ మండలాల్లో ప్రభుత్వ మద్యం షాపులతో పాటు ఎక్కడికక్కడ విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు వెలిశాయి. అయినప్పటికీ వాటిని నియంత్రించడంలో అధికారులు విఫలమయ్యారనే చెప్పాలి. పాఠశాలలు, దేవాలయాలకు అతి సమీపంలో కూడా మద్యం విక్రయాలు జరుగుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. బెల్ట్‌షాపు యజమానులతో అటు పోలీసులు, ఇటు ఎక్సైజ్ అధికారులు కుమ్మక్కయ్యారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గజపతినగరం మండలం విషయానికొస్తే గజపతినగరం, పురిటిపెంట, దావాలపేట రోడ్డు, ఎం.వెంకటాపురం, బంగారమ్మ పేట, పాత బగ్గాం, ఎం.కొత్తవలస, రంగుపురం, తదితర గ్రామాల్లో బెల్ట్‌షాపులు అధికంగా ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి బెల్ట్‌షాపులపై దాడులు నిర్వహించి అరికట్టాలని మండల వాసులు కోరుతున్నారు.



మహంకాళి అమ్మవారి టెంపుల్ సమీపంలోని బెల్ట్‌షాపు

అరికట్టాలి..

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు వెలిశాయి. స్పందించాల్సిన అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవరిస్తున్నారు. చిన్నారులు, మహిళలు సంచరిస్తున్న ప్రాంతాల్లో సైతం బెల్ట్ షాపులు ఏర్పాటు చేయడం శోచనీయం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బెల్ట్‌షాపులను నిర్మూలించాలి.

– బి. గౌరినాయుడు, తుమ్మికాపల్లి, గజపతినగరం మండలం

150 మంది నిర్వాహకులపై కేసులు

ఎక్సైజ్ శాఖ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని మండలాల్లో ప్రత్యేక నిఘా సారిస్తున్నాం. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సుమారు 150 మందిని గుర్తించి కేసులు నమోదు చేశాం. అలాగే వారి వద్ద నుంచి 273.5 లీటర్ల మద్యం , 6.5 లీటర్ల బీరును స్వాదీనం చేసుకున్నాం.

– జె.జనార్దనరావు, ఎక్సైజ్ సీఐ

మంత్రి ఇలాకాలో ఏరులై పారుతున్న మద్యం

- ఏ గ్రామంలో చూసినా బెల్ట్ షాపులే



బొండపల్లి మండలం నెలివాడలో ఎక్సైజ్ అధికారులు పట్టుకున్న మద్యం సీసాలు (ఫైల్)

దత్తిరాజేరు: గజపతినగరం ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాస్ మంత్రిగా ఉన్నప్పటికీ ఆయన నియోజకవర్గంలోనే మద్యం ఏరులై పారుతోంది. ఏ గ్రామంలో చూసినా విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నెలకొన్నాయి. గజపతినగరం సర్కిల్ పరిధిలో ప్రభుత్వం 19 లైసెన్స్‌డ్ మద్యం షాపులకు అనుమతిస్తే వాటి పరిధిలో వందల సంఖ్యలో బెల్ట్‌షాపులు పుట్టుకొచ్చాయి. కొన్ని గ్రామాల్లో అయితే బెల్ట్‌షాపుల కోసం ఏకంగా వేలంపాటలు నిర్వహిస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.


గజపతినగరం సర్కిల్ పరిధిలో లైసెన్స్‌డ్ షాపులు	
దత్తిరాజేరు	04
గజపతినగరం	05
గంట్యాడ	06
బొండపల్లి	04

ఎంఆర్‌పీ కంటే అదనం..

లైసెన్స్‌డ్ మద్యం వ్యాపారులే నేరుగా బెల్ట్ షాపులకు తమ సిబ్బంది ద్వారా మద్యం సరఫరా చేస్తున్నారు. అక్కడ బెల్ట్‌షాపుల వారు ఎంఆర్‌పీ కంటే రూ. 50 నుంచి 70 రూపాయల వరకు అదనంగా వసూలు చేస్తూ నిలువునా దోచేస్తున్నారు. గజపతనగరం నియోజకవరగంలోని నాలుగు మండలాల పరిధిలో 2024 అక్టోబర్ నుంచి 2025 అక్టోబర్ వరకు సుమారు రూ. 180 కోట్లు మద్యం విక్రయాలు జరిగినట్లు అధికారుల అంచనా.

పదవులకు రాజీనామా చేసి మాట్లాడండి..

- వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు



మాట్లాడుతున్న రేగాన శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్ సీపీ గుర్తుపై గెలిచి ఆ తర్వాత స్వార్థం కోసం జనసేన కండువాలు కప్పుకున్న నాయకులు తమ పదవులకు రాజీనామా చేసి మాట్లాడాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మండలంలోని సీతారామునిపేటలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సొంత ప్రయోజనాల కోసం పార్టీ మారిన వారు మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడును విమర్శించడం సరికాదన్నారు. వైఎస్సార్ సీపీ తరఫున ఎంపీటీసీగా బంటుపల్లి వాసుదేవరావు బరిలో నిలబెట్టి గెలిపించిన ఘనత మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుదని, గతం మరిచి ఆయనపై విమర్శలు చేయడం బాధాకరమన్నారు. కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు గతంలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండకు జేసీబీలతో పూలవర్షం కురిపించి ఆహ్వానం పలికారని అప్పుడు మంచివారు..ఇప్పుడు చెడ్డవారా ఆయనను విమర్శిస్తున్నారు అని నిలదీశారు. రాజకీయాల్లో హుందాతనం ఎంతో అవసరమని, నీతి నిజాయితీ పాటించిన వారైతే తక్షణమే పదవులకు రాజీనామా చేయాలన్నారు.

జీవో నంబరు 590ను వెనక్కి తీసుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు పాపారావు

నెల్లిమర్ల రూరల్: ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ(పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంలో నిర్వహించాలని నిర్ణయం చేస్తూ జారీ చేసిన జీవో నంబరు 590ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మండలంలోని కొండగుంపాం గ్రామంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగించడం అంటే పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడమేనన్నారు. మెజార్టీ ప్రజలు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి రూ.70 వేల కోట్ల విలువైన భూములు సేకరించి కేటాయించడ జరిగిందన్నారు. కళాశాలల నిర్మాణానికి కేంద్రం 60 శాతం, రాష్ట్ర 40 శాతం ఖర్చును భరించాలని, ప్రభుత్వమే కళాశాలలను నిర్వహించాలని కోరారు. ఆయన వెంట సీపీఐ నేత తవిటినాయుడు ఉన్నారు.